సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొన వచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు వస్తువుల అందజేత



భారతమ్మ కుటుంబ సభ్యులకు వస్తువులు అందజేస్తున్న సూరాడ అప్పారావు

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో గత కొన్నేళ్లుగా ఆశ్రయం పొందుతూ ఇటీవల మృతి చెందిన భారతమ్మ దశ దిన కర్మ శనివారం సంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. భారతమ్మకు ప్రతి నెలా వచ్చిన పెన్షన్ సొమ్ముని బ్యాంక్‌లో భద్రపరచి, ఆ మొత్తంతో బంగారు ఆభరణాలు (ఉంగరం, చెవి దుద్దులు) కొనుగోలు చేశారు. ఆ వస్తువులను సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు భారతమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ముందుగా భారతమ్మ చిత్రపటానికి ద్రోణంరాజు శ్రీవత్సవ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె పేరిట అన్నదానం, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు స్వామి, అప్పలకొండ, సత్తిబాబు, భానోజీరావు, పైడిరాజు, మహిళా సభ్యులు, భారతమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 35 మందికి ఉపాధి



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

సీతమ్మధార: ద్వారకానగర్‌లో గల మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 35 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్లు పొందారు. ఈ సందర్భంగా సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ మాట్లాడుతూ ఎం.ఎస్. భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోస్టుల భర్తీ కోసం ఈ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంస్థ ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. గత ఏడాది నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 45 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ప్రస్తుతం పలు ట్రెండింగ్ కోర్సులను పరిశ్రమలకు అనుగుణంగా, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అందిస్తుందన్నారు. సంస్థ భవిష్యత్తులో ఇంకా ఎంతో మందికి ఉపాధి అందిస్తుందని తెలిపారు. భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సిస్టమ్ అనలిస్ట్ ప్రదీప్ మాట్లాడుతూ వెబ్ అప్లికేషన్ అభివృద్ధిలో కృత్రిమ మేధ (ఏఐ) ప్రాముఖ్యతను తెలిపారు. అభ్యర్థులు మంచి కెరీర్ కోసం డేటా సైన్స్ వంటి అత్యున్నత సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిలీనియం సంస్థ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ జి. సాగర్, భార్గో సంస్థ అసిస్టెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ వైవీ రాజు, టీమ్ లీడర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పది నోటుతో పరేషాన్



మార్కెట్లో చెలామణి తగ్గిన పది రూపాయల నోటు



మార్కెట్లో తగ్గిన చెలామణి

ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు

అల్లిపురం:

చిల్లర లేనిదే ప్రజలు, వ్యాపారులకు రోజు గడవని పరిస్థితి. ఇప్పటికే రూ.1, రూ.2, రూ.5 నాణేలు, నోట్లు కనుమరుగయ్యాయి. తాజాగా రూ.10 నోటు కనిపించడం గగనంగా మారింది. దీంతో అటు వ్యాపారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కిరాణా, ఫ్యాన్సీ, కూరగాయలు, బస్సు, ఆటో చార్జీల్లో రూ.10కి ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో రూ.10 నోటు అందుబాటులో లేక వ్యాపారులు, ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులకు ఆదరణ..

కరోనా తర్వాత డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతో దక్షిణ నియోజకవర్గంలోని అల్లిపురం మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్, రామకృష్ణా రైతు మార్కెట్, పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్ తదితర ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటు పడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా, చివరికి వీధి వ్యాపారులు, తట్ట నెత్తిన పెట్టి వీధి వీధి తిరిగి అమ్మకాలు చేస్తున్న చిరు వ్యాపారులు సైతం ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ చెల్లింపులకు మొగ్గు చూపుతున్నారు. దీంతో చిల్లర సమస్య కొంత వరకు తీరుతుందని వ్యాపారులు, వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మార్కెట్లో క్రమంగా రూ.10 నోటు బదలాయింపు జరగక పోవటంతో మార్కెట్లో అది కనిపించకుండా పోయింది. ప్రస్తుతం చిరిగిన రూ.10 నోట్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

ఎందుకీ పరిస్థితి?

రైతు బజార్లు, మార్కెట్లలో రూ.10 నోటు చెలామణి తగ్గడానికి కారణం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యాపారులు సైతం ఈ పరిస్థితిపై ఒక అంచనాకు రాలేక పోతున్నారు. రూ.100 నోటు ఇస్తే చిల్లర ఇవ్వలేక పోతున్నామని చెబుతున్నారు. గతంలో రూ.1, రూ.2 తిరిగి ఇవ్వాల్సి వస్తే చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి పంపేవారు. కానీ రూ.10కి ఏమివ్వాలో తెలియక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. కాయగూరలమ్మే వారు, రైతు బజార్లలో చిల్లర లేక రౌండ్ ఫిగర్ అవుతుంది మరో వంద, రెండు వందల గ్రాములు కలిపి తీసుకోండి అంటున్నారు. రిజర్వ్ బ్యాంకు పది రూపాయల నాణేల వినియోగం పెంచేందుకు రూ.10 కొత్త నోట్ల ముద్రను నిలిపివేసినట్లు సమాచారం. మార్కెట్లో ఉన్న నోట్లు నలిగిపోయి, కన్నాలు పడి ఉండటంతో తరచూ వినియోగదారులకు, వ్యాపారులకు మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి.



తన వద్ద ఉన్న మాసిపోయిన పది నోటు చూపిస్తున్న కొబ్బరి బొండాల వ్యాపారి రాజు



పది నోటును చూపిస్తున్న పూల వ్యాపారి దాసరి కనకమహాలక్ష్మి

రూ. పది నోటు కనిపించడంలేదు..



పది రూపాయల నోటు కనిపించడమే గగనమైపోయింది. రాక రాక ఒకటో రెండో వస్తే అవి మాసిపోయి, నల్లగా మారుతున్నాయి. వాటిని తిరిగి వినియోగదారులకు ఇస్తే తీసుకునే పరిస్థితి లేదు. చిల్లర కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– కె.రాజు, కొబ్బరిబొండాల వ్యాపారి, అల్లిపురం

గల్లా పెట్టె ఖాళీగా ఉంటుంది..



అరకొరగా వచ్చే రూ.10 నోట్లు చిరిగిపోయి ఉంటున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నా తిరిగి ఇచ్చే సమయంలో ఎవరూ తీసుకోవడం లేదు. దీంతో నష్టపోతున్నాం. ఫోన్‌పే చేయించుకోవాల్సి వస్తుంది. దీని వల్ల గల్లా పెట్టెలో చిల్లర ఉండడంలేదు.

– దాసరి కనకమహాలక్ష్మి, పూలవ్యాపారి, అల్లిపురం మార్కెట్

ఇబ్బంది పడుతున్నాం..



రూ.10 నోట్లు లేకపోవటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్నవి కూడా మాసిపోయి ఉండటంతో వాటిని తీసుకోలేకపోతున్నాం. కొందరు వ్యాపారులు రూ.10 నాణేలు ఇస్తే తీసుకోవటంలేదు. ఏం చెయ్యాలో అర్థం కావటంలేదు.

– సంజీవరెడ్డి, కుమ్మరవీధి, అల్లిపురం

బళ్లిగిరి ఆలయంలో నేడు అన్నసమారాధన



విశేష అలంకరణలో బళ్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బళ్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నెల రోజులుగా ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

బళ్లిగిరికి పోటెత్తిన భక్తులు..

శనివారం బళ్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు విశేష పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం స్వామి వారికి విశేష హారతులు అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న రాజశేఖర్

డాబాగార్డెన్స్: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఇల్లందు పటేల్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన 80వ ఆనంద మేళోత్సవాల్లో ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎవరు నిష్కామ కర్మతో భగవన్నామ సంకీర్తన చేస్తారో వారికి దైవానుగ్రహంతో పాటు అంతిమంలో మోక్షం కలుగుతుందని తెలిపారు. ప్రేమమూర్తుల కృప భక్తులపైన, మనందరిపైన వర్షించాలన్నారు. కుసుమ హరనాథుల ప్రచార సంస్థచే నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజశేఖర్ సంకీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు.

కూటమి హామీలన్నీ అబద్ధాలే

- మీడియాతో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఒక్క సిక్స్ కూడా కొట్టలేక, డకౌట్ అయిందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్వజమెత్తారు. వివాహ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆశీల్‌మెట్ట సమీపాన గల తన కార్యాలయంలో మాట్లాడారు. అంతకు ముందు వాసుపల్లి గణేష్‌కుమార్, ఉషారాణి దంపతులు అల్లిపురంలో వేంచేసిన శ్రీవేంకటేశ్వర స్వామిని, బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలువురు ఆలయ మాజీ చైర్మన్లు వివాహ వార్షికోత్సవ కేక్ కట్ చేసి వాసుపల్లి దంపతులను సత్కరించారు. అనంతరం వాసుపల్లి మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా అమ్ముతుంటే అడ్డుకోలేని కూటమి నేతలు సిగ్గుపడాలన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం నిర్ణయాన్ని తిరస్కరిస్తూ అసమ్మతి ప్రకటించారన్నారు. 2027 జమిలి ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు మళ్లీ జగనన్న కోసమే ఎదురు చూస్తున్నారని వాసుపల్లి తెలిపారు. పలువురు కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



వాసుపల్లి దంపతులకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న జానకీరామ్ తదితరులు

స్టీల్‌ప్లాంట్‌కి శాశ్వత పరిష్కారం చూపాలి

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ కింద రూ.11,440 కోట్లు కేటాయించడాన్ని ఆహ్వానిస్తున్నామని... అయితే ఆ ప్యాకేజీతోనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగిపోతుందనుకోవడం భ్రమే అని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా కార్యదర్శి యు.నాగరాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు, ఉద్యోగుల పీఎఫ్, ఇతర బెనిఫిట్స్ అన్నీ కలిపి రూ.17 వేల కోట్లు అవసరమన్నారు. ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకు అప్పులు, వడ్డీలు మాఫీ చేస్తున్న కేంద్రం విశాఖ ఉక్కుకి ఆ వెసులుబాటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. విశాఖ ఉక్కుకి ఉన్నటువంటి రూ.17 వేల కోట్ల అప్పు మాఫీ చేసి ప్రైవేటీకరించడం లేదని స్పష్టమైన ప్రకటన చేసి, సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనన్నారు. విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజా సంఘాల పోరాట ఫలితంగానే కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభించి నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: జనక్రాంతి ట్రస్ట్ సహకారంతో డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నడిచే కేంద్రాల్లో శిక్షణ పొందడం వల్ల నైపుణ్యంతో పాటు పోటీ ప్రపంచానికి కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా అందుతుందన్నారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ జనక్రాంతి ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ శివప్రసాద్ శిక్షణ తరగతులకు కావల్సిన రూ.10 లక్షల విలువ గల కంప్యూటర్స్‌ను అందజేశారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకుడు ఎల్లాజీ మాట్లాడుతూ ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్, అకౌంటింగ్, మల్టీ మీడియా వంటి సోషల్ మీడియాకు సంబంధించిన కోర్సులు నామమాత్రపు రుసుంతో రోజుకు 4 షిఫ్ట్‌ల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ నిర్వహణ బాధ్యులు జీఎస్ రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, కామేశ్వరరావు, ఎమ్మారెడ్డి రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుంభమేళాలో అలరించిన ఉషశ్రీ ప్రదర్శన

కంచరపాలెం : ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో విశాఖ జిల్లా కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి ఉషశ్రీ భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన శ్రీవారి నమూనా ఆలయంలో స్వామి ఊంజల్ సేవలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల సిబ్బంది డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో నాట్య గురువులు డాక్టర్ పరంకుశం శరత్‌చంద్రతో కలిసి ఉషశ్రీ చేసిన భరతనాట్యం చూపరులను కట్టిపడేసింది. ఉషశ్రీ తన హావభావాలతో అందరిలో భక్తి భావాన్ని పెంపొందించింది. 144 సంవత్సరాలకు వచ్చే మహా కుంభమేళాలో భరతనాట్యం చేయడం తమ పూర్వ జన్మ సుకృతంగా ఆ బృంద సభ్యులు పేర్కొన్నారు.



మహా కుంభమేళాలో భరతనాట్యం చేస్తున్న ఉమ్మిడి ఉషశ్రీ

ఏఎంసీ వుమెన్స్ హాస్టల్లో చోరీ

- 4 సెల్‌ఫోన్లు తస్కరించిన యువతి
- ఆమెను పట్టుకుని సెల్‌ఫోన్లు లాక్కున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కాలేజీ వుమెన్స్ హాస్టల్లో దొంగలు పడ్డారు. విలువైన నాలుగు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడ్డ యువతి వైద్య విద్యార్థినిగా హాస్టల్లోకి ప్రవేశించింది. సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతున్న దృశ్యాన్ని పలువురు వైద్య విద్యార్థినులు పసిగట్టి.. ఆ యువతి నుంచి సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ఆంధ్రా మెడికల్ కళాశాల వుమెన్స్ హాస్టల్లోకి రంగిరీజు వీధికి చెందిన ఓ యువతి వైద్య విద్యార్థినిగా లోపలికి చొరబడింది. హాస్టల్లోని పలు గదులను చెక్ చేసుకుంటూ విద్యార్థినులు లేని గదుల్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు దొంగలించింది. ఆ యువతి సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతుండడంతో పలువురు వైద్య విద్యార్థినులు పసిగట్టి ఆ యువతిని పట్టుకున్నారు. దొంగలించబడ్డ నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



ఆంధ్రా మెడికల్ కళాశాల ఉమెన్స్ హాస్టల్

సెక్యూరిటీ సిబ్బంది ఎక్కడ?

ఆ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నట్టా? లేనట్టా? అనేది అనుమానంగా ఉంది. సెల్‌ఫోన్లు దొంగిలించేందుకు హాస్టల్లోకి వెళ్లాలంటే అక్కడ విధులు నిర్వర్తించే ఓ మహిళా సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. అటువంటిది అక్కడ ఉన్న మహిళా సెక్యూరిటీని తప్పుదోవ పట్టించిందో.. లేదా వైద్య విద్యార్థినిగా లోపలికి ప్రవేశించిందో తెలియదు గానీ.. ఆ యువతి హుందాగా వెళ్లి.. సీసీ కెమెరా ద్వారా దొంగగా దొరికిపోయింది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సరస్వతీ పార్కులో శుభ్రం చేస్తున్న ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు తదితరులు



కేజీహెచ్‌లో శుభ్రం చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, వైద్యులు



ఫిషింగ్ హార్బర్‌లో శుభ్రం చేస్తున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు తదితరులు

జగదాంబ: స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్, స్వచ్ఛ విశాఖలో భాగంగా శనివారం జీవీఎంసీ 31వ వార్డు సరస్వతీ పార్కులో చెత్త ఎత్తి శుభ్రం చేశారు. జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్కులోని పలు ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఏఎంహెచ్‌వో పిలుపునిచ్చారు. జోన్ పరిధిలోని 12 వార్డుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని ఎన్నుకుని ఆ ప్రాంతీయులు, పాలకులను కలుపుకుని కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరెడ్డి, సెక్రటరీలు, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

మహారాణిపేట: కేజీహెచ్‌లో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు ఆస్పత్రిలో పలు ప్రాంతాలను శుభ్రం చేసి, క్యాజువాల్టీ పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారాలు తొలగించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది చేత సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ రవి, డాక్టర్ వాసవీలత, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ రాజేష్, ఏవో మంగరాజు పాల్గొన్నారు.

హార్బర్‌లో..

ఫిషింగ్ హార్బర్‌లోని పలు ప్రాంతాల్లో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా కార్యక్రమం జరిగింది. పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించారు. అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయంలో..

కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి మాధవి సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.



సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి మాధవి

నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం..

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు హెచ్చరించారు. పూర్ణా మార్కెట్‌లోని హోల్‌సేల్, రిటైల్ దుకాణాలను తనిఖీ చేసి 30 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పట్టుకున్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, మురళి, శ్రీను, ఉద్యోగులు తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు.

గ్రేస్ టబర్నకల్ మినిస్ట్రీస్

3వ ఫ్లోర్, రత్నమేరీ కాంప్లెక్స్, బిర్లా డైరెక్ట్స్ హోటల్ ప్రక్కన, ద్వారకానగర్, విశాఖపట్నం -16

సాయంత్ర కాల ఆరాధన!

రండి మన దేవుని స్తుతించి, ఘనపర్చుదాం!

పాస్టర్స్ : 7330811961, 9866268791

ఆరాధన సమయం : ఆదివారం సాయంత్రం 6.00 నుండి 7.30 వరకు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా! లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

వైజాగ్ సౌత్

7997958342, 9912440606